క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి పాలకొల్లు నాయకులు

పెనుగొండ: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును పాలకొల్లు నియోజకవర్గ నాయకులు సోమవారం తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకు చేస్తున్న కృషిని వివరించారు. వీరిలో జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, బీసీ విభాగం సంయుక్త కార్యదర్శి మామిడిశెట్టి చిట్టిబాబు, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు, సీనియర్ నాయకులు రామానుజుల చిన్న మధులు ఉన్నారు.

ఆలయానికి మైక్ సెట్ బహూకరణ



అమ్మవారి ఆలయానికి మైక్ సెట్ అందిస్తున్న భక్తుడు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తుడు మార్నెళ్ల మాణిక్యాలరావు, చంద్రికాదేవి దంపతులు రూ.30 వేలు విలువ గల మైక్ సెట్‌ను సమర్పించారు. దీనిని సోమవారం ఆలయ ప్రధానార్చకులు వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మార్నెళ్ల వెంకటేశ్వరరావు, మార్నెళ్ల లక్ష్మి, ఉన్నమట్ల కబర్ధి, జక్కంపూడి కుమార్, మల్లవోలు సురేష్, రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపి మృతి తీరని లోటు



గోపి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన నాయకుడు, మల్లిపూడి గ్రామానికి చెందిన నల్లిమిల్లి గోపి అకాల మరణం కుటుంబానికి, పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆయన మల్లిపూడి గ్రామంలో గోపి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. గోపి కుటుంబానికి ఉండగా ఉంటానని భరోసా కల్పించారు. రెండు రోజుల క్రితం గోపి చిన్న వయసులోనే పార్టీ ఆవిర్భావం నుంచి మల్లిపూడి గ్రామ ప్రజలకు ఎనలేని సేవలందించారని గుర్తుచేసుకున్నారు. తొలుత గోపి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి గోపాలకృష్ణారెడ్డి, యువ నాయకుడు గుడిమెట్ల ఎల్లారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు ఈతకోట ఇజ్రాయిల్, రాపాక రాజారావు, పుచ్చకాయల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంచారంతో ఇక్కట్లు



వైఎన్ కళాశాల వద్ద సంచరిస్తున్న పశువులు

నరసాపురం: స్థానిక మున్సిపాలిటీలో రోడ్లపై పశువుల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై ఆవులు, గేదెలు, దూడలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో పారిశుద్ధ్య, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని నెలల క్రితం పట్టణంలో ఎక్కడా రోడ్లపై పశువులు, పందులు కనిపించకూడదని మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. పందులను పట్టుకోవడం, రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులకు నోటీసులు ఇస్తామని హెచ్చరికలు కూడా చేశారు. తరువాత ఈ విషయాన్ని మరిచిపోయారు. రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపు అభినందనీయం

పెనుమంట్ర: ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ సోమవారం పెనుమంట్ర మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో అభినందన ప్రసార సభ నిర్వహించారు. కేంద్రం నిర్ణయం వల్ల సాధారణ, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కేజీ ప్రసాద్ రెడ్డి అన్నారు. సేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పెనుమంట్ర వారపు సంతలో చెత్త ఊడ్చే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గోపరాజు మారుతి కృష్ణ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుల్లాజీ పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద 41వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాలు ప్రాంభించారు. అమ్మవారు శ్రీశైలపుత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఓసూరి ఫణీంద్ర నర్సింహనాయుడు దంపతులు పూజల్లో కూర్చున్నారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణలు పర్యవేక్షించారు. గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, చినమామిడిపల్లిలో శృతి అపార్ట్‌మెంట్ వద్ద స్థానిక యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ప్రారంభించారు. పట్టణంలోని ప్రసిద్ధ కనకదుర్గ, రాయిపేట పుంతలోముసలమ్మ, వనువులమ్మ ఆలయాల వద్ద నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

మున్సిపల్ కార్యాలయంలో..

దేవీనవరాత్రి వేడుకలు సిబ్బంది నిర్వహించడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ జయరాజు దంపతులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. కౌన్సిలర్లు వైకేఎస్, చిట్టూరి కృష్ణ, మల్లాడి బుజ్జి, కేసరి గంగరాజు, గోరు సత్తిబాబు, పతివాడ పద్మ, కోటిపల్లి సురేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముగింపురోజు ఏనుగు ఉత్సవం నిర్వహించనున్నారు.

బాలా త్రిపుర సుందరిగా అలంకరణలో..

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి, వేములదీవి వెస్ట్, ఎల్బీచర్ల గ్రామం కాపులకొడప సెంటర్‌లో దుర్గమ్మవారు బాలా త్రిపుర సుందరిగా అలంకరణలో పూజలు అందుకున్నారు. పితాని మెరకలోని జాజులమ్మ ఆలయంలో నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. చినమైనవానిలంక, తూర్పుతాళ్లు గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సారవ గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి


పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా స్వామివారిని, పార్వతి, లక్ష్మీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం భక్తులు ఆలయ సప్తసోమవార ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మీసాల రాము, ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

బాలా త్రిపురసుందరి దేవిగా అమ్మవారి దర్శనం

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరణ చేశారు. ఉదయం కలశస్థాపన చేసి అమ్మవారికి నవావర్ణార్చన పూజలు చేశారు. లక్ష్మీ పార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో దసరా సందర్భంగా ఉదయం 102 కలశాలతో 102 మంది ఆర్యవైశ్య ముత్తైదువులతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలకు జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. యడ్లబజారు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.



నరసాపురం : పండ్ల మార్కెట్ వద్ద శ్రీశైలపుత్రీదేవిగా దుర్గమ్మ



నరసాపురం : చినమామిడిపల్లిలో పూజలందుకుంటున్న దుర్గమ్మ



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామలింగేశ్వరస్వామి



పాలకొల్లు సెంట్రల్ : బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ



పాలకొల్లు సెంట్రల్ : 102 కలశాలతో ఆర్యవైశ్య ముత్తైదువుల ఊరేగింపు



నరసాపురం రూరల్ : చినమైనవానిలంకలో దుర్గమ్మ



నరసాపురం రూరల్ : ఎల్బీచర్లలో అమ్మవారి విగ్రహం



పెనుగొండ: శ్రీబాల అలంకరణలో మూల విరాట్ వాసవీ మాతా



పెనుగొండ: శ్రీ బాల అలంకరణలో పెనుగొండ మహిషాసురమర్దని



పెనుగొండ : శ్రీబాల త్రిపుర సుందరిగా వాసవీ శాంతి ధాంలో వాసవీ మాత

శ్రీబాల అలంకరణల్లో అమ్మవార్లు

పెనుగొండ: దసరా మహోత్సవాల్లో భాగంగా ఆచంట నియోజకవర్గంలో అమ్మవార్లు సోమవారం శ్రీబాల అలంకరణల్లో దర్శనం ఇచ్చారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని, వాసవీమాతలను శ్రీబాలగా అలంకరించారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాతను శ్రీబాలా త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు.

కలశ స్థాపనలతో ఉత్సవాలు ప్రారంభం



పెనుమంట్ర: నెగ్గుపూడిలో కలశ స్థాపన చేస్తున్న కీర్తి కనకయ్య ఉషారాణి దంపతులు



పెనుమంట్ర: వెలగలవారి పాలెంలో పూజలు అందుకుకుంటున్న కనకదుర్గమ్మ



యలమంచిలి : మేడపాడులో కనకదుర్గమ్మను పూజిస్తున్న భక్తులు

పెనుమంట్ర: మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారి పీఠాల్లో సోమవారం కలశ స్థాపనలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమరాజు ఎల్లిందలపర్రులోని గోగులమ్మ కనదుర్గ ఆలయంలో ఎంపీపీ కర్రి వెంకట్ నారాయణ రెడ్డి రాధా దంపతుల ఆధ్వర్యంలో కలశ పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. నెగ్గపూడి పనువులమ్మ, కనక దుర్గమ్మ ఆలయంలో కీర్తి కనకయ్య ఉషారాణి, మార్టేరులోని కనక దుర్గ ఆలయంలో అడబాల శ్రీనివాస్ రామా ప్రభ, పోలేరమ్మ ఆలయంలో ఉగాది గోపికృష్ణ మహాలక్ష్మి, శ్రీ కంచి కామాక్షి ఆలయంలో గొలుగూరి నాగేశ్వరరెడ్డి ధనలక్ష్మి దంపతులు ఉత్సవాలను ప్రారంభించారు. పెనుమంట్రలో కనకదుర్గమ్మ, వెలగలవారి పాలెంలో కనకదుర్గమ్మ, ధనలక్ష్మి ఆలయాలు, నత్తరామేశ్వరంలోని విజయ దుర్గమ్మ, జిత్తుగలోని ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయ ఆవరణల్లో కలశ పూజలు చేశారు. వేడుకలను ప్రారంభించారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

యలమంచిలి: దసరా ఉస్సవాల సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామ ప్రధాన కూడళ్లలో కనకదుర్గమ్మ విగ్రహాలను నెలకొల్పారు. ఉదయం, సాయంత్రం దంపత సమేతంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాత్రి అమ్మవారి పందిళ్ల వద్ద కోలాట, తాళాల భజనలు చేశారు. పూజానంతరం ప్రసాద వితరణ చేశారు. మేడపాడు మాజీ సర్పంచ్ ఓదూరి కృష్ణమూర్తి ఇంటి వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు అడబాల రామ్మోహనరావు, సత్యవేణి దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులు కార్యక్రమాన్ని తిలకించి, అమ్మవారి ఆశీర్వాదం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అధిక ఎరువుల వినియోగంతో అనర్థం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఆకు ఎండు తెగులుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి: సంప్రదాయక వరి సాగు విధానంలో రైతులు నత్రజని ఎక్కువగా వినియోగిస్తున్నారు. తోటి రైతులతో పోల్చుకుని వారి పైరుకంటే పచ్చగా లేదన్న కారణంగా నత్రజని వినియోగానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. వరి సాగులో నత్రజని వినియోగం పరిమితికి మించితే అనర్థమేనని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

40,745 ఎకరాల్లో వరి సాగు

ప్రస్తుత సీజన్లో నరసాపురం డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో దాదాపు 40,745 ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. అత్యధికంగా ఎంటీయూ 1318 వరి వంగడం సాగు చేశారు. పంటపై ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఉంది. ఈ తెగులు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగంపై గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నత్రజని అధికంగా వినియోగిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నత్రజని ఎక్కువ అవ్వడం లేదా 26 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల వరిపై అక్కడక్కడా ఆకు ఎండు తెగులు కన్పిస్తోంది. రైతులు పునఃపరిశీలించుకుని నత్రజని వినియోగాన్ని నియంత్రించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఉంటే ప్లాంటామైసిన్, కొసైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 0.2 గ్రాముల ప్లాంటోమైసిన్, రెండు గ్రాముల కొసైడ్ మిశ్రమాన్ని ఒక లీటరు నీటికి కలిపి వినియోగించాలి. పూత దశలో ఆకుఎండు తెగులు వస్తే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. నత్రజని అధికంగా వినియోగించిన పంట నుంచి వచ్చిన గింజల్లో నూక శాతం కూడా పెరుగుతుంది. పంట పరిస్థితిని అనుసరించి తగినంత మోతాదులో మాత్రమే ఎరువులను వినియోగించాలి.

మోతాదుకు మించొద్దు



ఏ ఎరువులైనా తగినంత మాత్రమే వినియోగించాలి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను రైతులు వినియోగించడం మానేశారు. దీనిని వినియోగిస్తే తెగుళ్ల వ్యాప్తి బాగా తగ్గుతుంది. పంట కాలంలో రెండుసార్లు ఎంవోపీ వేయాలి. అనవసరంగా వేసే ఎరువుల వల్ల రైతులకు పెట్టుబడి పెరిగిపోవడం తప్పితే, పంటకు ఉపయోగం ఉండదు. వరిపై ఆకు ఎండు తెగులును గుర్తించాం. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

– దుంగా బాల త్రిపుర సుందరి, మండల వ్యవసాయ అధికారి

ఇంజనీరంటే కోడింగ్ మాత్రమే కాదు

భీమవరం: ఇంజనీరంటే కేవలం కోడింగ్ చేయడం కాదని సమస్యను విభిన్న కోణాల్లో ఆలోచించి దానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఉండే పరిష్కారం కనుగొనడమని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఐడీఎల్ ల్యాబ్ హెడ్ నూకల గోపాలకృష్ణమూర్తి అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ఇంటర్ నేషనల్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ హాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యువ ఇంజనీర్లలో సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడానికి హాకథాన్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ జి సత్యనారాయణ రాజు (బాబు) మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానం సరిపోదని కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చాలా ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, ఇన్సిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ ఎస్ రవిచంద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ హర్నాథ్ పాల్గొన్నారు.

యువతకు సత్కారం



డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారిని సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో చదువుకుని మెగా డీఎస్సీలో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు గ్రంథాలయం కమిటీ సోమవారం సన్మానించింది. ఈ సందర్భంగా గ్రంథాలయ నివాహణ కమిటీ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు, కార్యదర్శి కవురు పెద్దిరాజు మాట్లాడుతూ మీరా గ్రంథాలయంలో మూడేళ్ల క్రితం సెమినార్ రీడింగ్ హాలు నిర్మించి, డైలీ న్యూస్ పేపర్స్‌తో పాటు వివిధ రకాల సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ గ్రంథాలయంలో చదివిన పి.సురేష్, డి.కిరణ్ కుమార్, ఎన్ బాబు మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, పొగాకు నారాయణరావు, నోములకొండ, బూడిద జోగేశ్వరరావు, జి.ఆజాద్, కవురు నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



వివాహ వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి తదితరులు

పాలకొల్లు సెంట్రల్: సీఎం చంద్రబాబునాయుడు బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడు వివాహ వేడుకకు హాజరవుతున్న సందర్భంగా హెలిప్యాడ్, కల్యాణ వేదిక ప్రాంతాల్లో ఏర్పాట్లను కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యవేక్షించారు. ముఖ్యమంత్రిని కలిసే ప్రముఖులకు ఎల్ 1, ఎల్ 2 ఏర్పాట్లు, పార్కింగ్, బారికేడ్లు, కాన్వాయ్ వంటి ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సీఎం సెక్యూరిటీ అధికారి రఘుబాబు, ఏఎస్పీ వి.భీమారావు, ఆర్డీఓ దాశి రాజు, డీఎస్పీ శ్రీ వేద, జిల్లా ఆర్అండ్‌బీ అధికారి శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ గీతా బాయి, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని రెండవ వార్డు జానకీ నగర్‌లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, నాలుగు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని ఆప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఓల్డ్ వయ్యేరు పంట కాల్వ నుంచి ధర్మాపురం ఆయుకట్టుకు, మంచినీటి చెరువుకు బంగారు కోడు పంట కాల్వ ద్వారా నీరు సరఫరా అవుతోందని, అయితే కాలువకు ఇరువైపులా ఆక్రమణలతో కుంచించుకపోయిందని, చెరువుల కలుషిత నీటిని పంట కాల్వలోకి వదిలివేయడం వల్ల మంచినీటి చెరువు కలుషితమవుతోందని స్థానిక నగర పంచాయతీ 15వ వార్డు కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చినకాపవరం గ్రామంలో తనకు చెందని భూమిని వెబ్‌ల్యాండ్‌లో ఇతరుల పేరుతో నమోదు అయిందని, రికార్డుల ప్రకారం తన పేరున నమోదు చేయాలని అల్లూరి తమ్మిరాజు ఫిర్యాదు చేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలో తన భూమి నెం.8-1లో సర్వే చేయించి, గత మూడు సంవత్సరాలుగా పన్నులు చెల్లిస్తున్నా బకాయి చూపిస్తున్నారని గ్రామానికి చెందిన దండు సుందరి ఫిర్యాదు చేశారు. స్థానిక జానకమ్మ ఆసుపత్రి ప్రాంగణంలో ఆక్రమణల్ని తొలగించాలని, జాతీయ రహదారికి చేర్చి ఉన్న ఆక్రమణల వల్ల ఆసుపత్రికి వచ్చేవారికి ఇబ్బంది ఏర్పడుతుందని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ జీ.డేవిడ్ లివింగ్ స్టన్ ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

లేబర్ కోడ్లు రద్దును నిరసిస్తూ ఆందోళన

భీమవరం: కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చేసి పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు హెచ్చరించారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం భీమవరంలో కార్మికులు బ్లాక్ డే పాటించి ప్రకాశంచౌక్ సెంటర్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, రంగారావు మాట్లాడుతూ బ్రిటిష్ హయాంలోనే ఎన్నో పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నామని కార్పొరేట్ శక్తులకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం వాటిని నాలుగు కోడ్స్‌గా మార్చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, దేశంలో కార్మిక సంస్కరణలను చర్చించడానికి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలాపు శ్రీను, రెల్ల రాము, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.